అక్రమ కొళాయిలు తొలగిస్తే "సరెండరా"...?

- సరెండర్‌కు "నో" చెప్పిన చైర్ పర్సన్

తొలగించిన అక్రమ కొళాయి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ముందు నుయ్యి.... వెనుక గొయ్యిలా....... తయారైంది మున్సిపల్ ఉద్యోగుల పరిస్థితి..... విషయానికొస్తే గత కొన్ని రోజులుగా పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనర్, ఉద్యోగుల మధ్య సయోధ్య కుదరడం లేదన్న విషయం పాఠకులకు విధితమే. ఇదిలా ఉండగా ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం దగ్గర పడడంతో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది వారికిచ్చిన టార్గెట్లను పూర్తి చేసేందుకు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, కొళాయి పన్ను వసూళ్లలో నిమగ్నమవుతున్నారు. ఈ తరుణంలో మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ అధికారి పన్నుల వసూళ్ల కార్యక్రమంలో పాల్గొని నిర్మలా కాలనీలో పన్నులు వసూళ్లు చేస్తున్న సందర్భంలో నీటి పన్ను చెల్లించని కొళాయిలను కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించే ప్రయత్నం చేశారని, అయితే ఈ కొళాయిల్లో కొన్ని కొళాయిలకు పూర్తిగా మున్సిపాలిటీ డిమాండ్ నోటీసు లేనివిగా గుర్తించి ఆ కొళాయిలు అనాధరైజ్డ్ కొళాయిలుగా గుర్తించి తొలగిస్తున్న సమయంలో అసలు చిక్కు మొదలైందన్న సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనాధరైజ్డ్‌గా గుర్తించి తొలగించిన కొళాయి కనెక్షన్ స్థానిక టీడీపీ నాయకురాలుది కావడంతో ఆమె ఈ సమాచారాన్ని శాసనసభ్యులకు చేరవేశారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు సంబంధిత రెవెన్యూ అధికారికి ఆ ప్రాంతంలో ఎటువంటి కొళాయిలు తొలగించవద్దని ఆ ప్రదేశం నుంచి వెళ్లకపోతే సరెండర్ చేయాల్సి వస్తుందని మందలించి (ఫోన్లో) ఈ రెవెన్యూ అధికారిని సరెండర్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు శాసనసభ్యులు ఆదేశాలు జారీ చేశారన్న వార్త గత నాలుగు రోజులుగా మున్సిపల్ కార్యాలయంలో చక్కర్లు కొడుతోంది. శాసనసభ్యుల మాటకు మున్సిపల్ కమిషనర్ వత్తాసు పలుకుతూ సరెండర్ చేసేందుకు ఉత్సాహం చూపించడం ఎంతవరకు సమంజసమని, అసలు మున్సిపల్ ఉద్యోగిని డైరెక్ట్‌గా సరెండర్ చేసే అధికారం కమిషనర్‌కి గాని శాసనసభ్యునికి గాని ఉందా అని సగటు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఒక ఉద్యోగి కార్యాలయానికి సంబంధించిన ఆర్థికపరమైన నేరం చేశాడని, విధి నిర్వహణలో అలసత్వం వహించినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారన్న తదితర ఆరోపణలు ఎదురైనప్పుడు ఈ విషయంపై ఎంక్వయిరీ కమిటీ వేసి ఆ కమిటీ రిపోర్టును పాలకవర్గ సమావేశంలో పెట్టి సంబంధిత ఉద్యోగిని సరెండర్ చేయమని గాని, సస్పెండ్ చేయమని గాని రీజనల్, రాష్ట్ర స్థాయి అధికారులకు మున్సిపల్ చైర్ పర్సన్ ఆమోదంతో నివేదిక పంపాలన్న నిబంధన మున్సిపల్ చట్టంలో పొందుపరిచి ఉంది. అయితే కమిషనర్ స్థాయి ఉద్యోగికి ఇవేవీ పట్టడం లేదు. ఉద్యోగి చేసినది తప్పు అని రుజువు చేస్తే పాలకవర్గ సమావేశంలో పెట్టి మున్సిపల్ చట్టానికి లోబడి చర్యలు తీసుకుంటామే తప్ప సరెండర్ చేసేందుకు సంతకం పెట్టేదే లేదని మున్సిపల్ చైర్ పర్సన్ తెగేసి చెప్పారన్న విషయం బయటికి రావడంతో మున్సిపల్ కమిషనర్‌కు గొంతులో వెలక్కాయ పడినట్లుగా అయిందని మున్సిపల్ ఉద్యోగులు బహిరంగంగా చెప్పుకోవడం విశేషం. ఏది ఏమైనా ఒక అక్రమ కొళాయి కనెక్షన్ తప్పించారన్న నెపంతో ఉద్యోగిపై ఏకపక్ష ధోరణిగా వ్యవహరించి కక్ష సాధింపు చేయటం ఎంతవరకు సమంజసమని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా రెవెన్యూ అధికారి సరెండర్ విషయం ఎటువంటి మలుపు తిరుగుతుందో వేసి చూద్దాం......

25 నుంచి కైలాసనాథ జాతర

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ఈనెల 25,26,27,28,29 తేదీల్లో కైలాస నాథ జాతర నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ జాతరను విజయవంతం చేయాలని, విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. భక్తులకు నడక మార్గంలోనూ ఎటువంటి ఆటంకం ఉండరాదని ఆయన అన్నారు. చిల్లర దుకాణాలు ఏర్పాటుకు కొన్ని స్థలాలను గుర్తించి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - వీరఘట్టం: పాలకొండ మండలం వెలగవాడ గ్రామంలో వేసవి సమీపిస్తున్న దృష్ట్యా చలివేంద్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ ప్రతినిధి శాసపు సుగుణాకరరావు ప్రారంభించారు. వెలగవాడ గ్రామంతోపాటు రుద్రపేట తదితర గ్రామ ప్రజలు బాటసారులు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి బొమ్మాలి ప్రసాదు, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాన్న సీతారాంపురంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని మండల వ్యవసాయ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో తాన్నసీతారాంపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సాగులో ఉపయోగపడుతున్న ఎరువు ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఘన జీవామృతంలో దేశి ఆవుపేడ 20 కేజీలకు లీటర్ ఆవు మూత్రం, కేజీ పప్పులు, పిండి అరకేజీ, బెల్లం కొంచెం, పుట్టమన్ను తీసుకొని కలుపుకొని 10రోజులు ఎండబెట్టి వాటిని పొలంలో చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, విఏఏలు పాల్గొన్నారు.

కార్యకర్తల్ని పరామర్శించిన మాజీ ఉపముఖ్యమంత్రి

విశాలాంధ్ర - కురుపాం: అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ కార్యకర్తలను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణీ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. కురుపాం పంచాయతీ శివన్నపేట, కాటందొరవలస గ్రామాలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రంశెట్టి రేవతి, బిడ్డిక వెంకటరమణ కుటుంబాలను పరామర్శిం చారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, సర్పంచ్ సుజాత, జడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, కె.గౌరీశంకర్, షేక్ జీలానీ తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - పాలకొండ: జీడి మామిడి పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాకు 20 వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పాలకొండ మండలం జంపర కోట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. గ్రామ సచివాలయం కార్యదర్శికి ఈ సందర్భంగా విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాపారులు, దళారుల యిష్టారాజ్యంగా జీడి మామిడి రైతులను దోచుకుంటున్నారని ఈ దోపిడీ నుంచి జీడి మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాకి 20 వేల రూపాయలు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి మామిడి పంటను కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి మామిడి రైతులకు యంత్ర పరికరాలను, టార్పాలిన్లను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణు భీమ లింగం, వర్లక లక్ష్మణరావు, కొండ గౌర్రె పద్మ, చిలకల అప్పల నరసమ్మ, ఆరిక మోహన్‌రావు, చిలకల జగ్గయ్య, జిలకర మోహన్ రావు, కొండగౌర్రె సూర్యనారాయణ, చిలకల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరల్ హెపటైటిస్‌తో అప్రమత్తం: డీఎంహెచ్‌ఓ

విశాలాంధ్ర - బెలగాం: అవగాహన, అప్రమత్తతో వైరల్ హెపటైటిస్ (వైరల్ సంబంధిత కాలేయ వ్యాధి) సోకకుండా జాగ్రత్త పడవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. ఈ మేరకు కాలేయ వ్యాధి నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం ఆయన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. వైరల్ హెపటైటిస్ సోకిన వారిలో శరీరం త్వరగా అలసిపోవడం, కడుపు నొప్పిగా ఉండటం, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, చర్మం రంగు మారడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం (కామెర్లు), యూరిన్ రంగు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహన రావు, డా. ఎం.వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలా, డెమో సన్యాసిరావు, డీఎస్ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉప తహాశీల్దార్‌కు వినతి అందజేశారు. జీడి పంట కేజీకి 200 రూపాయలు, 80 కేజీలకు 16,000 రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. బలిజిపేట మండలంలో నారాయణపురం, గౌరీపురం, పెద్దింపేట, అరసాడ, పదమవలస, మిర్తి వలస, పెద్ద పెంకి, భైరిపురం గ్రామాలలో సుమారుగా 1000 ఎకరాలు జీడి పండుతుందని, వెంటనే మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో బద్దన భానుమూర్తి రెడ్డి, సూరి, యమ్మల మన్మధరావు, దన్నాన త్రినాధ పాల్గొన్నారు.

రైతులు సహకారంతోనే భూముల సర్వే విజయవంతం

విశాలాంధ్ర - పాచిపెంట: రైతులు సహకారం అందించడం ద్వారానే రెవెన్యూ సర్వేను విజయవంతం చేయగలమని పాచి పెంట తహాశీల్దార్ డి.రవి అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంట కమ్యూనిటీ భవనంలో మంగళవారం రైతులతో రవి మాట్లాడుతూ గతంలో చేసిన సర్వేలో వచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ పరిధిలో ఉన్న భూములకు రీ సర్వే చేసి రైతులకు హక్కులు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క రైతు తమ దగ్గర ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకువచ్చి రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దండి ఏడుకొండలరావు, డిప్యూటీ తహాశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ రమణ పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి: కలెక్టర్



విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గృహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర 2047 విజన్లో భాగంగా 2029 నాటికి అందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా పీఎంఏవై 1.0లో ఇల్లు మంజూరై, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. ఎస్సీలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు సాయం అందించనుందని అన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అసంపూర్తి గృహ నిర్మాణాలకు రూ.73.09 కోట్ల మేర అదనపు సాయం అందించే అవకాశం లభించిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. ఇప్పటివరకు చేపట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఈనెల 21లోగా చెల్లింపులు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాకు కేటాయించిన 7వేల గృహ నిర్మాణ లక్ష్యాలను జూన్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణ సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాఫీ పంట శత శాతం ఈ-క్రాప్ నమోదు చేయండి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో 281సాలిడ్ వేస్ట్ ప్రొక్యూర్మెంట్ కేంద్రాలు పని చేయు స్థితిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా అధికారులతో వీక్లీ సమీక్షను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ గావించాలని, వారంలో కనీసం రెండు రోజులు ప్రతి ఇంటిని సందర్శించి చెత్త సేకరణ చర్యలు చేపట్టాలని, ప్రజలు అలవాటు పడేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల 34 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరైనందున ఆయా తహసిల్దార్లు అందుకు సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ప్రతి రైతుకు దేశ వ్యాప్తంగా యూనిక్ ఐడి కేటాయింపునకు ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో కాఫీ, ఆయిల్ పాం, వెదురు తదితర రైతులను, వారి భూములను గుర్తించి సాట్యురేషన్ స్థాయిలో పండించడానికి చర్యలు తీసుకోవాలని, కాఫీ పంటను తప్పనిసరిగా ఇ. క్రాప్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎపిఎంఐపి కింద 750 హెక్టార్ల టార్గెట్ కు గాను ఇప్పటివరకు 626 హెక్టార్లు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 124 హెక్టార్లలో బిందు తుంపర సేద్య పరికరాలను ఈ నెలాఖరులోగా పూర్తీ చేయాలని ఆదేశించారు. అరకు మండలంలో 400 పైగా విభిన్న ప్రతిభావంతులు ఉన్న0దున విభిన్న ప్రతిభావంతుల శాఖ సహకారంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారి ఆసక్తి మేరకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

సాయినగర్‌లో దాహం కేకలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలోని సాయి నగర్ వీధిలో గత కొద్ది రోజులుగా వీధి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కాక పలు ఇబ్బందులకు గురవుతున్నామని సాయినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సాయినగర్ వీధి నుంచి మహిళలు ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సాయినగర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో త్రాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మహిళలు నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నీటి సమస్య పరిష్కరించాలంటూ అధిక సంఖ్యలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడారు. గత కొద్ది రోజులుగా కుళాయిల ద్వారా నీళ్లు సరఫరా జరగడంలేదని అధికారులకు తెలియజేసినప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో మార్పు రావడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సాయి నగర్‌లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు, సిపిఎం పార్టీ నాయకులను ఉద్దేశించి ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ గడుతూరి స్వర్ణలతలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాగిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. తక్షణమే ట్యాంకులు ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ యుఎస్‌వి శ్రీనివాస రావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి గడుతూరి స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: కూటమి పార్టీ అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు 10వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చినా నేటికి 10 నెలలు కావస్తున్నా ఇప్పటికీ హామీ నెరవేరలేదని వాలంటరీ యూనియన్ నాయకులు కూర్మం రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి వాలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల వాలంటీర్లు మండల నాయకులు కుర్మన్ రాజు, కొండబాబు, సిదారి చిన్నరావు పాల్గొన్నారు.

21న మెగా వైద్య శిబిరం

సీఐ వరప్రసాద్

విశాలాంధ్ర - జీకే వీధి: ఈనెల 21వ తేదీ శుక్రవారం పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించబడుతుందని జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పూడి తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మెగా వైద్య శిబిరానికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. మెగా వాలీబాల్ టోర్నమెంటులో మొదటి, రెండవ, మూడవ విజేతలకు క్యాష్ ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుందన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - హుకుంపేట: పశువులకు గాలికుంటు టీకాలు వేయించి రోగాల బారి నుండి పశువులను కా పాడాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు రైతులను కోరారు. మంగళవారం హుకుంపేట మండలం సూకురు పంచాయతీ ములుసోభ గ్రామంలో నిర్వహించిన గాలికుంటు టీకాల కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుండి 31 వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని రైతులు వినియోగించు కోవాలని ఆయన అన్నారు. ఈ టీకాలు పశువులకు తప్పనిసరిగా వేయించి రోగాల నుంచి కాపాడగలిగితే పశు సంపద మరింత పెరిగి ఆర్థిక అభివృద్ధి అందిస్తుందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని అటువంటి పశువులకు రోగాలు రాకుండా చూసుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇప్పటివరకు మండలంలో 13332 పశువులకు గాలి కుంటు టీకాలు వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట పశు వైద్యాధికారి కే.చరణ్, వి.ఎ.సిహెచ్ .ప్రశాంత్, ఏహెచ్ఏలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రధానమంత్రి జన్‌మన్ ప్రోగ్రా ంలో రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కేంద్రాలను ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి, జేసీ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ మంగళ వారం పరిశీలించారు. పాడేరు మండలం ముంత మామిడి, రణం బడి గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణం బడి మల్టీపర్పస్ సెంటర్‌ను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ముంత మామిడి మల్టీపర్పస్ కేంద్రాన్ని రెండు వారాల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని సూచించారు. మల్టీ పర్పస్ కేంద్రాల్లో హెల్త్ సెంటర్, అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీఈ రవికుమార్, ఏఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పంచదారను ఎవరికి విక్రయించలేదు

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో సబ్సిడీ ద్వారా లబ్ధిదారులకు అందించిన సబ్సిడీ పంచదారకు చెందిన ప్యాకెట్లు కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం చేపట్టిన సుదీర్ఘ విచారణలో జీసీసీ ద్వారా పంపిణీ చేసిన పంచదారను రేషన్ కార్డ్ హోల్డర్స్ వద్ద నుండి పెళ్లిళ్లు చేసుకునే వారు తీసుకొని కవర్లు బయటకు పారేసినట్టు తెలిసింది. పత్రికలో వచ్చినట్టు ఏ జీసీసీకి సంబంధించిన సెల్స్ మొన్న, ఎవరూ ఎకరికీ విక్రయించలేదని స్పష్టమైంది.

సాంప్రదాయ ఆహార పంటలతో ఆరోగ్యం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: సాంప్రదాయ ఆహార పంటలతో ఆరోగ్యకరంగా ఉండడానికి దోహద పడుతుందని ఎంపీడీవో ప్రేమసాగర్ అన్నారు. మండలం లోని లక్కలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వ ర్యంలో ఆదివాసీ సాంప్రదాయ ఆహార పంటల పండగను నిర్వ హించారు. చిరు, తృణధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలతో చేసిన పిండి వంట కాలతో పాటు అటవీ ఫలసాయలు, దుంపలు, ఆకు కూరలు, ఔషధ వన మూలికల ప్రదర్శనను చేపట్టారు. సాంప్రదాయ బద్ధంగా పండించే దినుసులలో పోషకాలు మెండుగా ఉంటాయని సీపీఎఫ్ సంస్థ పీఓ నాగ మణి అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయ పంటల సాగుకు ఊతమివ్వాలని ఆమె కోరారు. అనంతరం సంగీత వాయిద్య పరికరాలను గ్రామస్థులకు అందజేశారు. చింతూరు, భద్రాచలంకు చెందిన ఆ సంస్థ ప్రతి నిధులు రాము, వీసీలు గాసినాయుడు, కమల, సీసీలు లక్ష్మి, మాలతి పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ మరియు ఎక్స్ అఫీషియో జాయింటు కలక్టరు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం.

నోటిఫికేషన్

తేది: 18-03-2025

శ్రీయుత జిల్లా కలెక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వారి RC.No.625/2022/DT-Admin/Dt.24.01.2025 అనుసరించిన అల్లూరి సీతారామరాజు జిల్లా నందు గల ఆర్ & ఆర్ కార్యాలయములు, రంపచోడవరం, ఏటపాక, చింతూరునందు తేదీ. 24-07-2026వరకు విధులు నిర్వర్తించుటకు ఆశక్తి గల అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతూ ఈ దిగువ తెలిపిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగములకు నోటిఫికేషన్ జారీచేయడమైనది.

వ.నెం.	పోస్ట్ వివరములు	అల్లూరి సీతారామ రాజు జిల్లా ఖాళీలు సంఖ్య	వయస్సు	వేతనము	విద్యా అర్హత / అనుభవము	రిమార్కులు
1	సీనియర్ అసిస్టెంట్	1	18-42 (18-09-2024 నాటికి)	As per G.O.M.s. No.7 Finance (HR.I-Plg.& Policy) Department,Dt 17.01.2022	ఏదైనా డిగ్రీ	అల్లూరు సీతా రామరాజు జిల్లాకు చెందిన అభ్యర్థులుమాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు
2	వర్క్ ఇన్‌స్పెక్టర్	2			డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్/ బి.టెక్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్	
3	డేటా ఎంట్రీ ఆపరేటర్	2			బి.సి.ఏ/ఎం.సి.ఏ/బి.టెక్ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీ (కంప్యూటర్స్)	
4	ఆఫీస్‌సబార్డినేట్	1			10వ తరగతి (లేదా) దానికి సమానమైన విద్యా అర్హత	
మొత్తము ఖాళీలు		6				

సదరు ఔట్ సోర్సింగ్ పోస్టులకు శ్రీయుత జిల్లా కలెక్టర్, అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు వారు జారీ చేసిన రోస్టర్ పాయింట్స్ ఈ క్రింది విధముగా కలవు :

వ.నెం.	పోస్ట్ వివరములు	రోస్టర్ పాయింట్ నెం.	రిజర్వేషన్ కేటగిరి
1	సీనియర్ అసిస్టెంట్	7	S.C.
2	వర్క్ ఇన్‌స్పెక్టర్	8	S.T. మహిళా
		9	O.C.
3	డేటా ఎంట్రీ ఆపరేటర్	24	B.C.-B
		25	S.T.
4	ఆఫీస్ అబార్డినేట్	17	O.C. మహిళా

కావున, అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవపత్రములతో జతచేసి (గెజిటెడ్ అధికారి వారితో అటెస్టెడ్ చేయబడిన విద్యా అర్హత, స్టడీ ధృవపత్రములు, కుల ధృవీకరణ ధృవపత్రము, నివాస ధ్రువపత్రము, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో&ఇతరములు)లను జత చేసి తమ దరఖాస్తులను తేది 07-04-2025 సాయంత్రం 5.00 గం॥ల లోపు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, సి.ఆర్.పి. గెస్ట్ హౌస్, ధవళేశ్వరం గ్రామం, రాజమహేంద్రవరం రూరల్ నందు నేరుగా అందచేయవలెను.

ఎంపిక విధానము :

వ.నెం.	పోస్ట్ వివరములు	ప్రక్రియ
1	సీనియర్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్	వ్రాతపరీక్ష & ఇంటర్వ్యూ
2	ఆఫీస్‌సబార్డినేట్	విద్యార్హతలో మెరిట్ & పని అనుభవము ఆధారముగా

ఎంపిక కాబడిన అభ్యర్థులు ఆర్&ఆర్ కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రంపచోడవరం, చింతూరు మరియు ఏటపాక యూనిట్స్, అల్లూరి సీతారామరాజు జిల్లా నందు పనిచేయవలసి ఉంటుంది.

గమనిక :
1. దరఖాస్తునకు తగిన అర్హత ధ్రువపత్రములు జతచేయని యెడల వారు దరఖాస్తులను తిరస్కరించబడును మరియు ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.
2. పై తెలిపిన ఖాళీల సంఖ్య తాత్కాలికమైనవి మరియు డిపార్ట్‌మెంట్ అవసరాన్ని బట్టి పెంచడానికి లేదా తగ్గించడానికి అవకాశం ఉంది.
3. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ &
ఎక్స్ అఫిసియో జాయింటు కలక్టరు,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - పార్వతీపురం: పీఎం జన్మన్ అంగన్వాడి హెల్పర్స్ ఇంటర్వ్యూలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం తన ఛాంబరులో నిర్వహించారు. మొత్తం 8 పోస్టులకుగాను 13 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూల్లో ఐసీడీఎస్ పథక సంచాలకులు డా. టి.కనకదుర్గ, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, సీడీపీఓ తదితరులున్నారు.

ఏనుగుల జోన్ పెట్టి ఇబ్బంది పెట్టొద్దు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అమ్మాదేవి కొండవద్ద ఏనుగులు జోన్ ఏర్పాటుచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని అప్పయ్యపేట, జోగంపేట, గుచ్చిమి, తాన్నసీతారాంపురం, తామరఖండి, రేపటివలస, పులిగుమ్మి, గదబవలస తదితర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. అప్పయ్యపేట అమ్మాదేవి కొండ చుట్టూ అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా చేపడుతున్న ట్రెంచ్ కటింగ్ (కందకాలు త్రవ్వకం)పనులు ఆపాలని ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టి పనులను అడ్డుకుని, జెసిబి,ప్రొక్లైనర్‌తో కందకాలు తవ్వడం పనులు చేస్తున్న యంత్రాలను అడ్డుకొని బయటకు పంపించారు. ఈనెల 13న ఇలాగే అప్పయ్యపేటవద్ద పనులు చేస్తున్న యంత్రాన్ని అడ్డుకోవడం జరిగిందన్నారు. అటవీ అధికారులు పనులు చేపట్టవద్దని, ఏమైనా పనులు చేపడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అయినా కూడా అటవీ అధికారులు ముందుగా పోలీసులను మోహరించి మరలపనులు చేయడం ప్రారంభిస్తున్నారని తెలిసి ప్రజల ఈరోజున పెద్ద ఎత్తున అడ్డుకుని అక్కడున్న యంత్రాలను బయటకు పంపించాలని, అంతవరకు అక్కడి నుంచి కదిలేదిలేదని, లేకుంటే తీవ్ర పరిణామాలు దాపరిస్తాయని హెచ్చరిక చేశారు. రైతు సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ కొండ పరిసర ప్రాంతాల్లో గత 50 ఏళ్లుగా పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు కూడా మంజూరు చేసిందని, రైతు భరోసా కూడా వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ప్రజలను ఇబ్బందులు గురిచేయడం తగదని, కొండ దిగువ ఆయకట్టు భూములకు కంధకాలు తవ్వడం ద్వారా సాగు నీరు ఆటంకం కలుగుతుందన్నారు. వర్షాకాలంలో ఈ కొండగడ్డల ద్వారా సీతానగరంలో వందల ఎకరాల విస్తీర్ణం గల వెంకటరాయుడి ,గుచ్చిమిగ్రామంలో తాన్నచెరువు, అప్పయ్యపేట గ్రామంలో గొట్టాపుచెరువు, అప్పయ్యబంద, బుడ్డిపేటలోగల రామసాగరం చెరువు,,కొమటి చెరువు, కారివాని బంధ,లక్ష్మీపురం గ్రామంలోగల మావుళ్ళ చెరువులు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఏనుగులు ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికే తరలించాలని, లేదా జంతు సంరక్షణ కేంద్రానికి తరలించాలి కానీ జిల్లానడిబొడ్డున జనావాసాల మధ్య ఏనుగు జోన్ పెట్టడం ప్రభుత్వానికి సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, సీతానగరం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ,రెడ్డి రమణమూర్తి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - జీకే వీధి: రంపుల్ గ్రామంలో శ్రీశ్రీ గాలి కొండమ్మ మల్లేశ్వరి అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు నరేష్ బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన మెగా వాలీబాల్ టోర్నమెంట్లో విజేతలుగా నిలిచిన మొదటి బహుమతి రింతాడ పంచాయితీ ఏబులం గ్రామం, ద్వితీయ బహుమతి సంకట పంచాయతీ నల్లబెల్లి గ్రామం ఇరుజట్లు విజయం సాధించారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ ప్రథమ బహుమతిని పి.ఆర్ జె.ఈ జ్యోతి బాబు, ద్వితీయ బహుమతి శోభ బాలకృష్ణ (టీచర్)ల సహకారంతో బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, గెమ్మెలి దొరబాబు,విరోజి సత్తి బాబు,సిరిబల రామారావు, కంకిపాటి రామారావు గ్రామ పెద్దలు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు తెలియకుండా నగదు లావాదేవీలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం తంటికొండ పంచాయితీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన 15 డ్వాక్రా సంఘాల సభ్యులు అనుమతులు, ఎటువంటి సమాచారం లేకుండా రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేసి, తిరిగి బ్యాంకు వారే తీసుకున్నారంటూ వట్టిగడ్డ గ్రామానికి చెందిన కావేరి, సంధ్య, వనిత, దివ్య, ప్రియదర్శిని, రమ్య, సాయి తదితర గ్రూపులకు చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు రాజవొమ్మంగి వెలుగు ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు. అయితే తమకు రుణాలు మంజూరైనట్లు గాని డబ్బులు వేసినట్టు గాని తీసినట్లు గాని ఎటువంటి విషయాలు తెలియదని మాకు తెలియకుండా బ్యాంకులో లావాదేవీలు ఎలా జరిగాయంటూ ఏపిఎం రామాంజనేయులు, ఎంఎంఎస్‌లను నిలదీశారు. వెలుగు అధికారులు స్పందించి బుధవారం ఒట్టిగడ్డ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి విచారణ చేపట్టి, అనంతరం చర్యలు తీసుకుంటామని తెలపడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన విరమించారు.

పూడ్చి పెట్టిన బాలుడి మృత దేహానికి పోస్టు మార్టం..

విశాలాంధ్ర - వై.రామవరం: మండలంలోని పెదుఉలెంపాడు గ్రామంలో పూడ్చి పెట్టిన బాలుడి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు.

అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ, డాక్టర్ రాహుల్ సమక్షంలో మూడు సంవత్సరాల బాలుడు మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8న పెద ఊలెంపాడు గ్రామ సమీపంలో లో రెండు బైక్ లు ఢీకొన్న సంఘటనలో పెద ఉలేం పాడు గ్రామానికి చెందిన కర్రా స్వామిరెడ్డి తన మూడేళ్ల కుమారుడు జస్విక్ రెడ్డి తో బైక్ పై వెళ్తుండగా జరిగిన ప్రమాదం లో జాస్విక్ రెడ్డి అక్కడికక్కడే మరణించాడు.కుమారుడి మరణం తో బాధలో ఉన్న కారణంగా ఈ నెల 17 సాయంత్రం బాలుడి తల్లి కర్రా నాగదేవి తమకు ఫిర్యాదు చేసిందని దీంతో పూడ్చి పెట్టిన బాలుడి మృత దేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం జరిపామన్నారు .కార్యక్రమం లో ఆర్ ఐ శాంతకుమారి,వీఆర్వో గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీ క్రీడల్లో పాల్గొన్న రాష్ట్ర విప్

విశాలాంధ్ర - కురుపాం: విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆంధ్ర ప్రదేశ్ సాదికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్-2025లో ఇతర మంత్రులతో మరియు ఎమ్మెల్యేలతో కురుపాం రాష్ట్ర విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యం, మానసిక పునరుత్తేజానికి దోహద పడుతుందని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, జిల్లా మహిళ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని సూకూరు గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర పాఠశాల లను తనిఖీ వారితో ముచ్చటించారు.అనంతరం విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేసి సంకల్ప ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైం నేరాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ సేవించడం వల్ల కలిగే అనర్థాలపై ఆయన వివరించారు. చెడు వ్యసనాలకు పోయి విద్యార్థి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు. పిఓ సిఎస్ ఓ చట్టం గురించి విఫలంగా వివరించారు. ఈ కార్యక్రమం డి ఐ జి, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ప్రతి స్కూలు, కాలేజీలలో ఈ సంకల్ప ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుం దని ఆయన అన్నారు.పాఠశాల స్థాయిలోనే ఉన్నత చదువులకు అస్కారంగా ఉంటుందని, పదవ తరగతి పరీక్షలను నిర్భయంగా హాజరై మంచి ఫలితాలను సాధిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపాలిటీ దంగిడివీధికి చెందిన గెంబలి కాంతారాజు పనుల నిమిత్తం పార్వతీపురం పట్టణం పాత బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా పార్వతీపురం నుండి వంగర వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కాంతారాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతనిని ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని గ్రామాల స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు సున్నం రాజులు, పులి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై మరో ఉద్యమానికి సిద్ధమవ్వాలని, ఈనెల 11వ తేదీన వి.ఆర్ పురం మండలంలో జరిగిన అఖిలపక్ష సమావేశంతో స్పందించిన అధికారులు మంగళవారం వి.ఆర్ పురం మండలం రెవెన్యూ కార్యాలయం వద్ద చింతూరు ఐటీడీఏ పీఓ సదస్సు ఏర్పాటు చేసి ప్రేయారిటీ గ్రామాల పిడిఎఫ్ సమస్యలను పరిష్కరించడం, దరఖాస్తులు స్వీకరించడాన్ని సి.పి.యం పార్టీ స్వాగతిస్తుందని అదేవిధంగా పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కొరకు హడావిడి సభలు కాకుండా పూర్తి స్థాయిలో ప్రజలకు సమాచారం తెలిపి గ్రామాల స్థాయిలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఆయా గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కదల కొండయ్య రెడ్డి, సీరపు తాతబాబు, కుంజ కన్నయ్య, ఖాదర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు శిక్షణా ధ్రువపత్రాలు

విశాలాంధ్ర - బెలగాం: పిహెచ్సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగు పడేందుకు శిక్షణ సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్టాఫ్ నర్సులకు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీ ఓరియంటేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులకు ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం డిఎంహెచ్ఓ చేతుల మీదుగా ధృవ పత్రాలను అందజేశారు. బ్యాచ్ ల వారీగా పిహెచ్సీ స్టాఫ్ నర్సులకు నిర్దేశించిన ఎఎస్బిఎ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) శిక్షణా కార్యక్రమంలో మొదటి బ్యాచ్ కి గత నెల 24 న ప్రారంభించి ఈ నెల18 వరకు 21 రోజులు జిల్లా ఆసుపత్రిలో, ఆరోగ్య కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ లు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. గర్భదారణ ప్రసవం, ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలను నివారించడంలో నైపుణ్యతను పెంపొందించడం, ప్రసవానంతరం కాలంలో గర్భిణీ, బాలింత, శిశువులకు ప్రాథమిక మరియు అత్యవసర సంరక్షణ అందించడం, హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి ప్రమాదకర పరిస్థితులకు దారి తీయకుండా సురక్షిత సాధారణ ప్రసవం మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మాతా, శిశు మరణాలు నివారించడం, పిహెచ్సీ ప్రసవాలు మెరుగు పర్చడం శిక్షణ ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా. ఎం.వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై విమర్శలు తగదు

విశాలాంధ్ర - జి.మాడుగుల: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట కోసం ప్రతిక్షణం కార్యకర్తల గౌరవాన్ని పెంచుతూ పనిచేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు పాడేరు శాసనసభ్యులు గౌరవ మత్స్యరాస విశ్వేశ్వర రాజు మీద చింతపల్లి మండల నాయకుడు మోరి రవి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైసీపీ మండల అధ్యక్షులు నుర్మని మత్యకొండం నాయుడు అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఐదు సంవత్సరాలు మండల అధ్యక్షులుగా పదవి అనుభవించి నేడు అధికారం లేకపోవడంతో వేరే పార్టీ నాయకులతో సంబంధాలు పెట్టుకుని సొంత పార్టీ మీద విమర్శలు చేయడం సరికాదన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గంలో మండల అధ్యక్షులను మార్పులు చేర్పులు చేయడం జరుగుతుందని అలాగే జిల్లా పదవుల్లో కూడా మార్పులు చేర్పులు చేశారని, పదవి పోతుందన్న బాధతో బహిరంగ విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంజారి సీతారాం నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శిర్మ పండన్న, స్థానిక సర్పంచ్ కిమ్ముడు రాంబాబు, సీనియర్ నాయకులు చిట్టిబాబు, మతే వెంకట రమణ, కొరబు కొండ బాబు, వంతాల రమణ, వండ్లబు దేముల్లు నాయుడు, గెమ్మెలి మురళి, నియోజక వర్గ వలంటర్ల అధ్యక్షులు మత్స్యరాస కుర్మాన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సహజ ఎరువులతో డబ్బు ఆదా

విశాలాంధ్ర - పాచిపెంట: వేసవికాలంలో సహజ ప్రకృతి ఎరువులను తయారు చేసుకుని నిలువ చేసుకుని అవసరమైనప్పుడు వాడుకుంటే రైతులకు డబ్బు ఆదా అవ్వడమే కాకుండా నేల స్వభావం బాగుపడి భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని వ్యవసాయ అధికారి కే.తిరుపతిరావు అన్నారు. పాంచాలి గ్రామంలో ప్రకృతి సేద్య ఎల్ వన్ తిరుపతి నాయుడు ఆధ్వ ర్యంలో రైతు కె నారాయణ రావు తయారుచేసిన ఘన జీవామృతం తయారీలో పాల్గొంటూ ఎకరానికి 200 కేజీల పొడి ఘన జీవామృతాన్ని దుక్కిలో వేసుకుంటే తర్వాత పంట కాలంలో ఎకరానికి 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని రెండు లేదా మూడు సార్లు పారించుకుంటే ఎలాంటి రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని చెప్పారు.రసాయన ఎరువులు పై వెచ్చించే ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ఒక్కసారి తయారుచేసిన ఘనజీవామృతం ఆరు నెలల పాటు నిల్వ ఉంటుందని 200 కేజీల ఆవు పేడకు రెండు కిలోల బెల్లం రెండు కిలోల శెనగపిండి కొంచెం పుట్ట మట్టి కలిపి కొద్ది కొద్దిగా ఆవు మూత్రం కలుపుతూ ఉండలుగా తయారుచేసి చెట్టు నీడన ఆరబెట్టుకోవాలని అన్నారు .15 రోజుల తర్వాత బస్తాలో నిల్వ ఉంచుకుని ఆరు నెలల వరకు వాడుకోవచ్చు అని తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో రైతులకు పొలం పనులు ఉండవు కాబట్టి ప్రకృతి ఎరువుల తయారీకి సమయాన్ని వెచ్చించినట్లయితే డబ్బు ఆదాతో పాటుగా భూమిని బాగు చేసుకోవచ్చని ఘనజీవామృతం వేసిన భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంటకు కావలసిన అన్ని పోషకాలు అందడమే కాకుండా భూ సారం గా పిలవబడే హ్యూమస్ శాతం కూడా క్రమక్రమంగా పెరుగుతుందని ప్రస్తుతం పంట భూములలో సేంద్రియ కర్బనం కనీసం ఒక్క శాతం ఉండాలని కానీ 0.01 % కంటే తక్కువగా ఉందని కేవలం రసాయన ఎరువుల మీద ఆధారపడితే క్రమక్రమంగా పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోతాయని కాబట్టి రైతులు ప్రకృతి ఎరువుల దిశగా దృష్టి సారించాలని కోరారు అనంతరం సహజ నాడెప్ కంపోస్ట్ పెట్టును పరిశీలించారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈదిబిల్లి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

విశాలాంధ్ర - దేవీపట్నం: దేవీపట్నం మండలం పెద్ద నూతులు గ్రామం నుంచి పండల సూర్యప్రకాశ్ రెడ్డి తన స్నేహితుడు చెదల రామిరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై మంటూరు గ్రామం వస్తుండగా పోతవరం గ్రామ శివారులో రోడ్డుకు అడ్డంగా అకస్మాత్తుగా ఒక గేదె అడ్డు రావడంతో రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్ర గాయం అయింది. అదేవిధంగా వెనుక కూర్చున్న అతని మిత్రునికి చిన్న చిన్న గాయాలయ్యాయి. వెంటనే వీరి బంధువులు ఆసుపత్రికి వీరిని తరలించగా మంగళవారం తెల్లవారుజామున మంటూరు గ్రామమునకు చెందిన పండాల సూర్య ప్రకాష్ రెడ్డి(32) తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు దీనిపై క్రైమ్ నెంబర్ 17/2025యూ/ఎస్ 106(1) బి.ఎన్.స్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు దేవీపట్నం ఎస్ఐకే షరీఫ్ తెలియజేశారు.

కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

విశాలాంధ్ర - వీరఘట్టం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఎంపీడీఓ వెంకటరమణ సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లు, ప్రతి పంచాయతీలోనూ చలివేంద్రాల ఏర్పాటు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల సక్రమ నిర్వహణ, గ్రామాల్లో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటి అందించడం గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి టి.రమణ మూర్తి, నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగుల సమస్యలపై వినతి

విశాలాంధ్ర - పాలకొండ: విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పాలకొండ తహశీల్దార్ బాలమురళీకి వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించి, 12వ పీఆర్సీ అమలు చేయాలని, బకాయి పడిన డీఆర్‌లు విడుదల చేయాలని, క్వాంటాం పెన్షన్ 70 సంవత్సరాల నుండి 10%, 75 సంవత్సరాల నుండి 15% ఇవ్వాలని, ఇటీవల రిటైర్ అయిన ఉద్యోగులకు పీఎఫ్, మొదలైన బకాయిలు విడుదల చేయాలని, హెల్త్ కార్డులమీద ఉచిత వైద్యం అన్ని ఆసుపత్రులలో అందించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో పాలకొండ పెన్షనర్లు రమణ మూర్తి, అచ్యుతరావు, వి.గోవిందరావు, వెంకట నాయుడు, మండల వెంకటరమణ, వి.లక్ష్మణరావు, రామకృష్ణ, పి.అప్పలాచారి, మాత చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

117వ తపాలా అదాలత్

విశాలాంధ్ర - బెలగాం: విశాఖ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల యొక్క వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించు నిమిత్తం ఈనెల 28వ తేదీ ఎంవిపి బస్ కాంప్లెక్స్ ప్రక్కనగల పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం వద్ద 117వ తపాలా అదాలత్ నిర్వహించబడునని పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్ నందు చర్చించబడునని, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామ రాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు ఈనెల 24వ తేదీలోగా "117వ తపాలా అదాలత్" అను శీర్షికతో" కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం- 530017" చిరునామాకు పంపవలసినదిగా కోరారు.

పది పరీక్షలకు సీసీ కెమెరాలు ఏర్పాటు



విశాలాంధ్ర - మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలకు ప్రభుత్వం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు జరుగుతున్న గదులు, ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

జె.కె.పాడులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మిపురం మండలం జెకెపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల జ్యోతి, సిహెచ్ ప్రసాద్, ఎం.దివ్య, మండల కోఆర్డినేటర్ గణేష్, గుమ్మ లక్ష్మీపురం యూనిట్ ఇన్చార్జి భూషణ్, ఎంటి నిర్మల, చామంతి రైతులు పాల్గొన్నారు. సామూహికంగా రైతులతో ఘనజీవామృతం తయారీ చేయడాన్ని వివరించారు. రైతులుకు వ్యవసాయ పరికరాలు 50 శాతం రాయితీపై అందించనున్నట్టు వివరించారు. అందుబాటులో ట్రాక్టర్ పరికరాలు, స్ప్రేయర్స్, పొవర్ టిల్లర్స్, వరి నూర్పిడి యంత్రాలు అందు బాటులో ఉన్నాయన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు: ఎంపీడీవో

విశాలాంధ్ర - కురుపాం: అర్హులైన వారి నుండి స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతోందని ఎంపీడీఓ జె.ఉమమహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 21 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు గల బిసి, ఇబిసికి చెందిన వారు ఈనెల 22 వ తేదీలోగా సచివాలయం లేదా ఇంటర్నెట్ సెంటర్లో https://apobmms.apcfss.in అనే సైట్ నుంచి దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి అందజేయాలని అన్నారు.

ఆర్వీనగర్ పాలగెడ్డ రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం ఆర్వీనగర్ పాలగెడ్డ అంతరాష్ట్ర రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్‌ను సీలేరు సర్పంచ్ దుర్గో, మాజీ ఉపసర్పంచ్ కారే శ్రీనివాస్ కోరారు. సీలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ హాజరయ్యారు ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్లో ఆర్వినగర్ నుంచి వై రామవరం మండలం పాలగడ్డ వరకు ఉన్న అంతరాష్ట్ర స్టేట్ హైవే రహదారి గత పది సంవత్సరాల నుంచి రోడ్డు నిర్మాణా పనులు చేయకపోవడం వలన బాగా శిథిలయిపోయిందని, దీంతో ఈ ప్రాంతంలో ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. కావున తక్షణమే ఈ రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు.